సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 10 । మే । 2024

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూం వద్ద భద్రత కట్టుదిట్టం

- సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ



భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూం వద్ద భద్రత కట్టుదిట్టం చేశామని పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. బుధవారం స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తులో ఉన్న సిబ్బందితో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాలను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఉన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన మున్సిపల్ కమిషనర్



సిద్దిపేటజోన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సాయి రమాదేవిని గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- గోనెపల్లిలో ఇరువర్గాల తోపులాట
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



గోనెపల్లిలో కార్యకర్తల మధ్య వాగ్వాదం

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇరువర్గాల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకుంటూ తోపులాడుకున్నారు. ఈ ఘటన గోనెపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. కాంగ్రెస్ నాయకులు మీసం నాగ రాజు వర్గీయులు కస్తూరిపల్లి, ఓబులాపూర్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం ముగించుకుని రాత్రి గోనెపల్లికి చేరుకున్నారు. అదే సమయంలో మరో కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ తన అనుచరులతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎలా వచ్చి ప్రచారం చేస్తారని చక్రధర్ గౌడ్ వర్గీయులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట మొదలైంది. ఆపై మాట మాటా పెరిగి తీవ్ర విమర్శలు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న చిన్నకోడూరు పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరు వర్గాల కార్యకర్తలను చెదరగొట్టారు.

బీసీల కులగణన చేపట్టాల్సిందే

- జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశంలో బీసీల కులగణన చేపట్టాలని, న్యాయం చేసే దిశగా పార్టీలు కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా జాజుల హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే కులగణనను స్వాగతిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమి జనాభా దామాషా పద్ధతిలో చట్టసభల్లో ప్రత్యేక రిజర్వేషన్ల చట్టం తెస్తామని హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మెదక్‌లో బీసీ బిడ్డ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలంమధు ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రవి, జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మెదక్‌లో విజయదుందుభి మోగిద్దాం

- ఈ ప్రాంతంపై ఇందిరమ్మకు ప్రత్యేక మమకారం
- బీజేపీ, బీఆర్ఎస్ చేతుల్లో అభివృద్ధి దూరం
- నర్సాపూర్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాహుల్‌గాంధీ రాకతో కార్యకర్తల్లో జోష్



సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



రాహుల్‌గాంధీకి ఇందిరాగాంధీ చిత్రపటాన్ని బహూకరిస్తున్న నీలం మధు, పక్కన సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్‌మున్షి

బీసీ బిడ్డను గెలిపిద్దాం

నర్సాపూర్/నర్సాపూర్‌రూరల్/శివ్వంపేట: ఇందిరమ్మ ఇక్కడి నుంచే పోటీ చేసి గెలుపొంది ప్రధాని అయ్యారని.. అందుకే బలహీనవర్గాల బిడ్డ నీలం మధును గెలిపిద్దామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నర్సాపూర్‌లో నిర్వహించిన జనజాతర సభలో ఆయన మాట్లాడారు. మెదక్ పార్లమెంట్‌పై ఇందిరాగాంధీ ప్రత్యేక మమకారం చూపడంతోనే వేలాది పరిశ్రమలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని అన్నారు. జిల్లాకు బీహెచ్ఈఎల్, బీడీఎల్ లాంటి పలు ప్రభుత్వ రంగ సంస్థలు వచ్చాయని, పటాన్‌చెరు పారిశ్రామికవాడలో పెట్టుబడులు రావడానికి కారణం ఇందిరమ్మ చలవే అన్నారు. 1999 నుంచి 2024 వరకు బీజేపీ, బీఆర్ఎస్ చేతుల్లో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. వారి చేతుల్లో నుంచి విముక్తి కల్పించే అవకాశం మీ చేతుల్లోనే ఉందన్నారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న రఘునందన్‌రావు దుబ్బాక ఉపఎన్నిక సమయంలో ప్రధాని మోదీ నుంచి రూ.వేల కోట్లు తెస్తానని హామీ ఇచ్చి నిధులు తేకుండా అక్కడి ప్రజల చెవిలో పువ్వు పెట్టాడన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆయనను బండకేసి కొట్టారని ఎద్దేవా చేశారు. మాదిగల వర్గీకరణ, ముదిరాజ్‌లను బీసీ ఏలోకి తెచ్చేందుకు, రిజర్వేషన్లు యథావిధిగా ఉండడానికి బీజేపీ, బీఆర్ఎస్‌ను బొంద పెట్టి నీలం మధును గెలిపించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ బస్సుయాత్రలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ఏదేదో అన్నారని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మాట్లాడాలని హితవు పలికారు.



జనజాతర సభకు హాజరైన జనం

ఒక్క మొనగాడు దొరకలేదా..?

మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాల కింద భూములు కోల్పోయిన రైతులు పరిహారం అడిగితే పోలీసులతో తొక్కించిన వెంకట్రామిరెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దించి జిల్లా రైతాంగాన్ని అవమాన పరిచారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావుకు రూ.వందల కోట్లు ఇస్తున్నందునే కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తిని మెదక్ బరిలో దించారని ఆరోపించారు. మెదక్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క మొనగాడు కూడా దొరకలేదా? అని ప్రశ్నించారు. పరిహారం అడిగితే కేసులు పెట్టించిన వెంకట్రామిరెడ్డిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం తన ప్రసంగంలో భాగంగా ప్రజలతో పలు నినాదాలు చేయించారు. సీఎం లక్ష అనగా పక్కా, బీజేపీ ఏమిచ్చింది మోదీ ఏమి తెచ్చిండు అనగా గాడిద గుడ్డు అంటూ సభికులతో నినాదాలు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కేరళ ఎంపీ సురేష్, ఏఐసీసీ అబ్జర్వర్ విశ్వనాథ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల, పటాన్‌చెరు ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రిజ్వాన్, హకీం, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, మల్లేష్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రుణపడి ఉంటా: అభ్యర్థి నీలం మధు

పేదింటికి చెందిన తనకు ఎంపీ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని ఆపార్టీ అభ్యర్థి నీలం మధు అన్నారు. మీ బిడ్డగా వస్తున్నా.. ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

దేశానికి మార్గదర్శి రాహుల్: మంత్రి దామోదర



సమాజానికి, దేశానికి రాహుల్‌గాంధీ మార్గదర్శి అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. అలాంటి వ్యక్తి దేశ ప్రధాని అయితే పేద, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి చెందుతారన్నారు. 4 నెలల కాలంలో 5 గ్యారంటీలను అమలు చేశామన్నారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనను తెలంగాణ సమాజం ఓట్లతో అంతం చేసిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశంలో కూడా అధికారంలోకి వస్తే పేదవాడికి పక్కా ఇళ్లు, స్థలాలు, భూములు ఇస్తుందన్నారు. 14 ఎంపీ స్థానాలు గెలిచి రాహుల్‌గాంధీని ప్రధాని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు.

విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ: మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ


బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతుందని మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ ఆరోపించారు. ప్రశాంతత, శాంతి లేని దేశంగా చేసేందుకు మోదీ కుట్ర పన్నుతున్నారన్నారు. శాంతిలేని దేశాల్లో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో గమనించాలని కోరారు.

ఇండియా కూటమితో ప్రగతి: మంత్రి కొండా సురేఖ



ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం, దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. బీసీలు ఏకతాటిపై ఉండి బడుగు, బలహీనవర్గాలకు చెందిన నీలం మధును లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్లలో చేసిందేమిలేదన్నారు. అవినీతి, అక్రమాలకు పెద్దపీట వేసి అస్తులు సంపాదించుకున్నారని మండిపడ్డారు. బీజేపీ మైనార్టీ రిజర్వేషన్లు ఎత్తివేసి వారిని అవమానపరిచే విధంగా వ్యవహరిస్తుందన్నారు. మోదీ, అమిత్‌షా మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు.

హోరెత్తుతున్న ప్రచారం



మిగిలింది రెండు రోజులే..

- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు
- పక్కా వ్యూహాలతో ముందుకు..
- ప్రత్యర్థులపై ఆరోపణలు, ప్రత్యారోపణలు
- ఇప్పటికే రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, సభలు

సాక్షి, సిద్దిపేట: లోక్‌సభ ఎన్నికల పోరు చివరి అంకానికి చేరుకుంది. ప్రచార గడువు ఇంకా రెండు రోజులే ఉంది. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎండలను సైతం లెక్కచేయకుండా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో మెదక్, సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలలో పూర్తి స్థాయిలో ప్రచారం చేపడుతున్నారు. ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, సీనియర్ నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రచార జోరును పెంచారు. మూడు ప్రధాన పార్టీ నేతలు ఒకరి పై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

ప్రత్యేక రూట్ మ్యాప్‌తో..

అభ్యర్థులు ఎక్కువగా రోడ్ షోలు, ర్యాలీలు, కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. మిగతా సమయాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కావడంతో ప్రత్యేకంగా రూట్ మ్యాప్‌ను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, గోవా సీఎం ప్రమోద్ సావంత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిలు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు కోసం ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

డోర్ టూ డోర్..

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు డోర్ టూ డోర్ ప్రచారం చేపట్టాయి. పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్నికల ప్రచారం చేపడుతున్నారు. ఆయా పార్టీల బూత్ కమిటీలు ఉదయం, సాయంత్రం సమయంలో ఇంటింటికీ తిరుగుతూ డమ్మి ఈవీఎం ద్వారా తమ పార్టీ అభ్యర్థి ఏ సంఖ్యలో ఉన్నారో తెలుపుతూ బటన్ నొక్కిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అలాగే అభ్యర్థుల కుటుంబ సభ్యులు సైతం ప్రచారం చేస్తున్నారు.

నేడు కేసీఆర్ రోడ్ షో

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర సిరిసిల్ల నుంచి శుక్రవారం సిద్దిపేటకు చేరుకోనుంది. పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించనున్నారు. అనంతరం పాతబస్టాండ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగిస్తారు. దీంతో ప్రజలను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేశారు. ఇప్పటికే స్వాగత ఏర్పాట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న కేసీఆర్

కేసీఆర్‌కు ఘన స్వాగతం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి కరీంనగర్‌కు ప్రచారానికి వెళ్తూ రంగధాంపల్లి చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళహారతులు పట్టిన ఎర్రవల్లి గ్రామస్తులు

మర్కుక్(గజ్వేల్): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎర్రవల్లిలో ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ తన వ్యవసాయక్షేత్రం నుంచి కరీంనగర్ సభకు బయలుదేరుతున్న క్రమంలో దత్తత గ్రామమైన ఎర్రవల్లి గ్రామస్తులు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయన వెళ్తున్న వాహనంపై గ్రామస్తులు పూల వర్షం కురిపించారు.

బెజ్జంకి వద్ద...

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు.

బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పాలి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లో 'పార్లమెంట్ ఎన్నికలు–కార్మికుల కర్తవ్యం' అనే అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి హాజరైన నర్సారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని మరిచి నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీ.. తిరుగుబాటుకు రావడంతో వెనక్కి తగ్గిందన్నారు. బీజేపీని ఓడిస్తేనే దేశ భవిష్యత్‌కు భద్రత ఏర్పడుతుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లిఖార్జున్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ అభ్యర్థులను ఎంపీ ఎన్నికల్లో ఓడించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య, గోపాలస్వామి, నాయకులు సర్దార్‌ఖాన్, బండ్ల స్వామి, వేణుగోపాల్, రవి, బాల్‌లక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సారెడ్డి

డబ్బుల రాజకీయాలకు కాలం చెల్లింది: రఘునందన్

దుబ్బాక: డబ్బులతో రాజకీయాలు చేసే కేసీఆర్, హరీశ్‌రావుల నాటకాలకు ఇక కాలం చెల్లిందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం హబ్షీపూర్‌నుంచి దుబ్బాక వరకు బీజేపీ నాయకులు రఘునందన్‌రావుకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. దుబ్బాక పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాల గడ్డ దుబ్బాక మట్టిలో పుట్టిన మీ బిడ్డను ఎంపీ గా ఆశీర్వదించి గెలిపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డిలు కోట్ల రూపాయలు పంచారని ఆరోపించారు. నేను మెదక్‌లో గెలవడం పక్కా .. కేసీఆర్, హరీశ్‌రావులు కూడా జైలుకెళ్లడం పక్కానే అన్నారు.

ఎన్నికలు మన గౌరవానికి ప్రతీక

- హైదరాబాద్ తర్వాత ఇక్కడే హజ్ హౌస్
- మైనారిటీల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: 'ప్రతి ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీ వర్గాలు అండగా ఉన్నారు. మీకు జీవితాంతం రుణపడి ఉంటా, ఎంపీ ఎన్నికల ఫలితాలు మన గౌరవానికి ప్రతీక, మెదక్ లో గులాబీ జెండా ఎగురాలి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలో హజ్ హౌస్ నిర్మించినట్టు తెలిపారు. ప్రతి సారి సొంత ఖర్చుతో పది మంది పేదలను ఉమ్రా యాత్రకు ఆరేళ్లు పంపిస్తున్నామన్నారు. నాకు సహకారం అందించినట్లుగానే ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి రెండు లక్షల మెజార్టీతో విజయం సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. శుక్రవారం సిద్దిపేటకు కేసీఆర్ రానున్నారని పెద్ద ఎత్తున ప్రజలు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, కౌన్సిలర్లు మోహిజ్, వజీర్, అక్తర్, నాయకులు చిన్న, సాయిరాం, భుపేష్, అక్బర్, మోహిజ్, జానీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్

బీజేపీతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

గజ్వేల్: ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసే కుట్ర చేస్తున్న బీజేపీని ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నాల కుమార్ అన్నారు. గురువారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ విధానాలపై మండిపడ్డారు. ప్రజల్లో మత విద్వేశాలను రెచ్చగొడుతూ, సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు బీజేపీ తెగబడుతుందని ఆరోపించారు. ఈ పరిస్థితి దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమన్నారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జక్కుల రాజు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మల్లన్న సన్నిధిలో క్యామ మల్లేశం



స్వామి వారికి పట్నం వేసి మొక్కు తీర్చుకుంటున్న మల్లేశం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం గురువారం దర్శించుకొని పట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా చేర్యాలలో తలపెట్టిన రోడ్ షోకు వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, జెడ్పీటీసీ సిద్ధప్ప, తలారి కిషన్, మెరుగు కృష్ణ, కొండా శ్రీధర్, ఏర్పుల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిపై ఫేక్ న్యూస్

పోలీసులకు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పై ఫేక్ న్యూస్ క్లిప్‌లతోపాటు వీడియోస్ వైరల్ చేస్తున్న వ్యక్తులపై సైబర్ క్రైమ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏకే గంగాధర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు పక్కా కావడంతోనే బీజేపీ, కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వైరల్ చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఇంటికి తులం బంగారం ఇవ్వనున్నట్లు బీఆర్ఎస్ అభ్యర్థిపై అసత్య కథనం తయారు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న మెదక్ పట్టణ పరిధిలోని అవుసులపల్లికి చెందిన ఆంజనేయులపై సైబర్‌క్రైమ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పేట మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ యాదగిరి, గొండస్వామి, నాయకులు లక్ష్మారెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, చంద్రం, రాజశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం తగదు

కరీంనగర్ పార్లమెంట్ అబ్జర్వర్ అమిత్ కటారియా

హుస్నాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, ఎలక్షన్ విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ అమిత్ కటారియా అన్నారు. గురువారం సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరితో కలిసి హుస్నాబాద్ ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్), మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 6,7,8, పోలింగ్ బూత్‌లను సందర్శించి ఓటర్ల జాబితాలను పరిశీలించారు. అనంతరం సెక్టోరియల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రూట్ ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

రూ.6 లక్షల నగదు పట్టివేత

సిద్దిపేటఅర్బన్: రూ.6లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు కలిగి ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన పలువురి నుంచి రూ.6,30,400 త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పొన్నాలలో శివారులో పలువురు వ్యక్తులు డబ్బు పంపిణీ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మిట్టపల్లి, పొన్నాల గ్రామాలకు చెందిన పయ్యావుల మల్లేశం, పయ్యావుల రాములు, చింతల శ్రీనివాస్, చింతల కుమార్, తుపాకుల బాల్ రంగం వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కేసు నమోదు చేస్తామని సీఐ విద్యాసాగర్ తెలిపారు.

ఓటర్లను ఆకట్టుకునేలా..

30 మోడల్ పోలింగ్ కేంద్రాలు

- మహిళలకు ప్రత్యేకంగా 28, దివ్యాంగులకు 7
- సన్నద్ధం చేస్తున్న అధికారులు
- ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద పూర్తి సమాచారం



కొల్చారం మండలం రంగంపేటలోని ఓ పోలింగ్ కేంద్రం

మెదక్ కలెక్టరేట్: మెదక్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మొత్తం 30 మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీ ఓటరు తప్పనిసరిగా తన ఓటు హక్కు వినియోగించుకునేలా స్వీప్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రతీ మండలం, గ్రామం, పట్టణంలో అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ఓటర్లను ఆకట్టుకునేలా.. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మెదక్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మొత్తం 2,124 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సిద్దిపేట(5), మెదక్(1), నర్సాపూర్(3), సంగారెడ్డి(5), పటాన్ చెరు(6), దుబ్బాక(5), గజ్వేల్(5) చొప్పున మొత్తం 30 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మహిళలకు ప్రత్యేకంగా సిద్దిపేట(6), మెదక్ (1), నర్సాపూర్(1), సంగారెడ్డి(5), పటాన్ చెరు(5), దుబ్బాక(5), గజ్వేల్(5) చొప్పున మొత్తం 28 కేంద్రాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు పడకుండా వసతులు కల్పిస్తున్నారు. అలాగే దివ్యాంగులకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 7 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు కొత్త ఓటర్లకు యువతను సైతం ఆకట్టుకునేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు

మెదక్ పార్లమెంట్ పరిధిలో 349 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా ఎన్నికల అధికారులు గుర్తించారు. సిద్దిపేట(23), మెదక్(53), నర్సాపూర్(70), సంగారెడ్డి(46), పటాన్ చెరు(47), దుబ్బాక(41), గజ్వేల్(69)ల చొప్పున మొత్తం 349 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించి తగు చర్యలు చేపడుతున్నారు.

పోలింగ్ కేంద్రం గోడపై వివరాలు

పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటరుకు ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే సంబంధిత అధికారికి ఫిర్యాదు చేసి సమస్య పరిష్కరించుకునేలా అన్ని వివరాలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్ఓతోపాటు పోలింగ్ కేంద్రంకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉండేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పీసీ, పీఎస్ పేరు, నంబర్, బీఎల్ఓ పేరు, సెల్ నంబర్‌తో పాటు సెక్టార్ ఆఫీసర్, పోలీస్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రిటర్నింగ్ అధికారి, కంట్రోల్‌రూం నంబర్లను పోలింగ్ కేంద్రాల గోడలపై ఏర్పాటు చేశారు.



పోలింగ్ కేంద్రం గోడపై పూర్తి సమాచారం

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): బీజేపీ కబంద హస్తాల నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు ఆ పార్టీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 'బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. దేశంలో సుమారు 10 కోట్ల మంది తిండి లేక అల్లాడుతుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మోదీ పాలనలో వ్యవసాయ పరిశ్రమలు దెబ్బతిని దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న భువనగిరి సీపీఎం పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే ముదిరాజ్‌ల అభివృద్ధి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



మాట్లాడుతున్న ముదిరాజ్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ముదిరాజ్‌ల అభ్యున్నతి కేసీఆర్‌తోనే సాధ్యమని, సీఎంగా ముదిరాజ్‌లకు ఎంతో కృషి చేశాడని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. గురువారం మనోహరాబాద్ మండలంలోని కూచారంలో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గ్రామాల్లో ముదిరాజ్‌లు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలు మోసపోయారన్నారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ముదిరాజ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంఘ నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీత రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్, ముదిరాజ్ మండల మహాసభ అధ్యక్షుడు దాసరి నరేశ్ కుమార్, మాజీ సర్పంచ్ నాగభూషణం, నాయకులు భిక్షపతి, సాదు సత్యనారాయణ, పాండు, గిరిధర్, కుంటరాజు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే ఖేడ్‌కు మరిన్ని నిధులు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఖేడ్ నియోజకవర్గానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం అభివృద్ధిలో దూసుకు పోతామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు కోసం నాగల్‌గిద్ద మండల కేంద్రంతోపాటు కరస్‌గుత్తి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురేశ్ షెట్కార్‌ను గెలిపిస్తే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తద్వారా అభివృద్ధికి భారీగా నిధులు వస్తాయని చెప్పారు. తనను ఆశీర్వదించిన తరహాలోనే సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని దుయ్యబట్టారు. ప్రచారంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్, ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికళ యాదవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, వినోద్ పాటిల్, మాణిక్‌రావు పటేల్, శ్రీకాంత్, ఎంపీటీసీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అసత్యపు ప్రచారాలు

బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్



మాట్లాడుతున్న బీబీ పాటిల్

టేక్మాల్(మెదక్): బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తారని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారనేది కాంగ్రెస్ అసత్యపు ప్రచారమని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ మండిపడ్డారు. గురువారం టేక్మాల్‌లో బీబీ పాటిల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, దేశంలో అసమానతలు తొలగిపోవాలంటే రిజర్వేషన్ల అవసరం ఉందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అరుణ తార, మాజీ మంత్రి అంజనేయులు, పార్లమెంట్ కన్వీనర్ రవి గౌడ్, అందోల్ అసెంబ్లీ సమన్వయ కర్త అడికె జగదీశ్వర్, కర్జం శివశంకర్, సిద్దేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోదీని ప్రధాని చేసేందుకే చేరికలు

జహీరాబాద్: నరేంద్ర మోదీని మరోమారు ప్రధానిని చేసేందుకు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా బీజేపీలో చేరుతున్నారని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.జైపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు ఉమాకాంత్ పాటిల్, కె.జనార్దన్‌రెడ్డి, ఎం.సుభాష్‌రెడ్డి, జీ.భాస్కర్, మంజుల కైలాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఇందుకు పాల్పడుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రిజర్వేషన్లు ఏ మాత్రం తీయబోమని ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. పదేళ్ల పాలనే ఇందుకు నిదర్శనమన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం నేర్పడం ఖాయమన్నారు. సమావేశంలో రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే నారాయణసింగ్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): యువకుడు అదృశ్యమైన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవికాంతరావు కథనం మేరకు.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మండలం కోటేశ్వర దుర్గాపురం గ్రామానికి చెందిన పొలాస సాయి (28) బతుకుదెరువు కోసం అక్బర్‌పేటకు వలసవచ్చాడు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలో ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం అక్బర్‌పేటలోని తన బావ కరబిండి శేఖర్ షాపు దగ్గరికి వెళ్లాడు. అక్కడే తన బైక్, సెల్‌ఫోన్ వదిలి మళ్లీ వస్తానని బావకు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన శేఖర్ భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రిమాండ్‌కు చోరీల దొంగ

కొండపాక(గజ్వేల్): దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసి సిద్దిపేట కోర్టులో హాజరుపర్చి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొడకండ్ల గ్రామంలో 2023లో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగిందంటూ బాధితుడు బీడ నర్సింలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తొగుట సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్, ప్రత్యేక టీం దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 8న బుధవారం రాత్రి కుకునూరుపల్లి బస్టాండ్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. నిందితుడు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని బర్కత్‌పురా కాలనీకి చెందిన షేక్ సలీంగా గుర్తించారు. నిందితుడి నుంచి సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో కీలకంగా పని చేసిన పోలీసులను, సిబ్బందిని అడిషినల్ డీసీపీ మల్లారెడ్డి అభినందించారు.

పొలిటికల్ హీట్

అధికారం కోసమే అబద్ధాలు

ఎమ్మెల్యే మాణిక్‌రావు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున గురువారం శాంతినగర్, హౌసింగ్‌బోర్డు కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలువిని ప్రజలు మోసపోయారని, ఇప్పుడు తగిన బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదారు నెలలు గడుస్తున్నా ఒక్కరికి కూడా కల్యాణ లక్ష్మి చెక్కులు ఇవ్వలేదని ఆరోపించారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, నియోజకవర్గం ఇన్‌చార్జి దేవిప్రసాద్, పార్టీ నాయకులు షేక్ ఫరీద్, నామ రవికిరణ్ గుప్త, తంజీమ్, గుండప్ప, యాకూబ్, అబ్దు ల్లా, ప్రభు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు నిధులు ఇవ్వని మోదీ

బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ రూపాయి హామీ ఇవ్వలేదని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. మోదీ ఎన్నికల సభ కోసం వేములవాడ రాజన్నను దర్శించుకొని.. ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారని ఎద్దేవ చేశారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం తప్ప రాజన్న ఆలయానికి నిధులు కేటాయించకపోవడం పై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏ గుడి దగ్గరకు పోతే ఆ దేవుడి మీద ఒట్టు వేస్తున్నాడని.. సీఎం జూటా మాటలు నమ్మొద్దన్నారు. కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్-మనోహరాబాద్‌కు రైల్వేలైన్‌ను తెచ్చానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కర్ర శ్రీహరి, పేర్యాల రవీందర్‌రావు, దేవందర్‌రావు, ఎంపీపీ కీర్తి, సురేశ్, పెరుగు నరేందర్‌రెడ్డి, ఆవుల మహేందర్, గవ్వ వంశీదర్‌రెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ర్యాలీలో చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): రైతు, కార్మిక, నిరుద్యోగుల సమస్యలను విస్మరించిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా గురువారం బెజ్జంకిలో సీపీఐ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ మనువాద వ్యవస్థ అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన అయోధ్య రామమందిరాన్ని ఎన్నికల్లో వాడుకొని లబ్ధిపొందేందుకు చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు, ధరణీ పోర్టల్‌లో అక్రమాలకు పాల్పడ్డారని మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించారు. సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మధు, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, రవి, రూపేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: అభివృద్ధితోపాటు అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. నారాయణఖేడ్‌లోని ఆయన నివాసంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో కారాముంగి ఎంపీటీసీ గడ్డె రమేశ్, నాయకులు సంతోష్, శంకర్, పుల్‌కుర్తికి చెందిన నాయకులు ప్రతాప్‌రెడ్డి, దత్తురెడ్డి, పాట్‌పల్లికి చెందిన పవన్ పటేల్, చిన్న సేరి ప్రతాప్ రెడ్డి, బీబీపేట మాజీ సర్పంచ్ రాములు నాయక్ తదితరులు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి షెట్కార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు పోతుల సంగారెడ్డి, మారుతీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పైకి శ్రీరాం.. లోపల రిజర్వేషన్లకు రాంరాం

- దిగజారి మాట్లాడుతున్న మోదీ
- వేములవాడకు రూ.కోటి కాదు కదా.. కోడె కూడా ఇవ్వలే
- మంత్రి పొన్నం ప్రభాకర్



చాడ వెంకట్ రెడ్డి, సీపీఐ నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ప్రధాని మోదీ పైకి శ్రీరామ్ అని.. లోలోపల రిజర్వేషన్లకు రాం రాం చెబుతున్నారని, మొదటి, రెండో, మూడో విడత పోలింగ్ తర్వాత దిగజారి మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావును బలపరుస్తూ గురువారం సీపీఐ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్ , సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తే ఆస్తులు గుంజుకొని ముస్లింలకు ఇస్తారని మోదీ అబద్ధాలు ఆడుతున్నారని, ఎప్పుడైనా చేశామా అని ప్రశ్నించారు. బుధవారం వేములవాడకు వచ్చిన మోదీ ఆలయ అభివృద్ధికి ఏదైనా ఇస్తారని అనుకున్నామని, రూ.కోటి కాదు కదా ఒక్క కోడే కూడా ఇవ్వలేదని ఎద్దేవ చేశారు. ఎన్నికల అనంతరం సీపీఐ గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నారాయణలను పిలిచి ఆత్మీయ సమ్మేళనం చేసుకుందామని తెలిపారు.

సమగ్రాభివృద్ధి కోసం కృషి చేయాలి

హుస్నాబాద్ సమగ్రాభివృద్ధికి మంత్రి పొన్నం కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు స్థానం లేకుండా చేయాలన్నారు. సమావేశంలో సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల సీపీఐ అధ్యక్షులు మంద పవన్, వెంకటస్వామి, భిక్షపతి, నాయకులు గడిపె మల్లేశ్, కొయ్యడ సృజన్ కుమార్, సత్యనారాయణ, ఏడు మండలాల సీపీఐ కార్యదర్శులు, గ్రామ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీతోనే చేనేత రంగం కుదేలు

చేనేత మీద జీఎస్టీ విధించడంతోనే ఆ రంగం సంక్షోభంలోకి నెట్టి వేయబడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో గురువారం పలు వార్డుల్లో కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావును గెలిపించాలని మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చేనేత సహకార ఉత్పత్తి విక్రయ కేంద్రంలో మగ్గం ద్వారా బట్టలు నేశారు. హుస్నాబాద్ పట్టణంలోని 3వ వార్డులో ఇళ్లలోకి వరద నీరు రాకుండా , డ్రైనేజీ నుంచి నీళ్లు పోయేలా ఇంజనీర్లు ప్రణాళిక రూపొందించారన్నారు. భవిష్యత్‌లో ఇక్కడి ఇళ్లల్లోకి నీళ్లు రావని, వస్తే నా ఎమ్మెల్యే ఆఫీస్ ఎదుట ధర్నా చేయండని తెలిపారు. కేబీ కాలనీలో ఇళ్లు లేని వారికి మొదట ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుగులోతు కవిత-తిరుపతి బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, కాంగ్రెస్ గిరిజన నేత ధరావత్ తిరుపతి నాయక్, నాయకులు గుగులోతు నర్సింహ నాయక్, రవి, బంగినాయక్, భూక్య తిరుపతి, వడ్లూరి తిరుపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీరప్ప ఉత్సవాల్లో సిద్దిపేట ఎమ్మెల్యే



ఎమ్మెల్యే హరీశ్‌రావును గొంగడితో సన్మానిస్తున్న కురుమలు

సిద్దిపేటరూరల్: మాజీ సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందని, ఆయన లేకపోతే రాష్ట్రం వచ్చేదా అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో జరుగుతున్న బీరప్ప కామరతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ స్వరాష్ట్ర సాధనతో సిద్దిపేట జిల్లాగా ఏర్పడిందని, నేడు కాళేశ్వరం జలాలు రావడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమైందన్నారు. బీరప్ప ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ యాదయ్య, మాజీ సర్పంచ్ పరమేశ్వర్‌గౌడ్, గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రతిభను వెలికితీయాలి



సమ్మర్ క్యాంప్ బొమ్మలు వేస్తున్న పిల్లలు

గజ్వేల్‌రూరల్: పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీస్తే వారిలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టినట్లవుతుందని ప్రజ్ఞాపూర్ ఎంపీపీఎస్ హెచ్ఎం మధునాల శ్రీనివాస్ అన్నారు. ఏప్రిల్ 28 నుంచి మే 9 వరకు పాఠశాలలోని రూం టూ రీడ్ లైబ్రరీ ప్రోగ్రాంలో భాగంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో రీడింగ్ హాబిట్‌ను డెవలప్ చేశామని, అక్షరాలు, పదాలు, వాక్యాలకు తేడాను వివరించినట్లు పేర్కొన్నారు. అలాగే పేరెంట్ క్యాలెండర్, ఆక్టివిటీస్, వర్క్‌షీట్, ఆక్టివిటీస్ చేయడంతో పాటు డ్రాయింగ్ వేయడం వంటివి నేర్పించినట్లు తెలిపారు. విద్యార్థులు రోల్ ప్లేస్ చేయడం, సొంతంగా కథ రాయడం నేర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ కోఆర్డినేటర్ సునీత, ఉపాధ్యాయులు ప్రేమలత, వెంకటమ్మ, బాలస్వామి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 153 మంది హాజరు

సిద్దిపేటఅర్బన్: ఇంజనీరింగ్ కోర్సు ప్రవేశాలకు పొన్నాలలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు తొలిరోజు 153 మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన సెషన్‌కు 76 మంది, మధ్యాహ్నం నిర్వహించిన సెషన్‌కు 77 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు ఒక విద్యార్థి ఆలస్యంగా రావడంతో నిబంధనల మేరకు అనుమతించకపోవడంతో వెనుదిరిగివెళ్లిపోయాడు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఈనెల 11 వరకు జరగనున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ మాధురి, కుమార్, పీఆర్వో రఘు తదితరులు పరీక్షలను పర్యవేక్షించారు.

వ్యాసరచన పోటీలు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. టీఎస్ ఆర్టీసీ ఆదాయ మార్గాలు, లక్ష్యం, ఆర్టీసీ ఉద్యోగుల కర్తవ్యం, వారి కుటుంబ సభ్యుల పాత్ర- సహకారం అనే అంశాలపై నాలుగు పేజీలు మించకుండా వ్యాసాన్ని రాసి సంబంధిత డిపోలలో ఏర్పాటు చేసిన బాక్స్‌ల్లో ఈనెల 20వ తేదీ లోపు వేయాలని పేర్కొన్నారు. 29, 30, 31వ తేదీల్లో సంబంధిత డిపోల పరిధిలో ఉత్తమ వ్యాస రచనలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఎస్పీ మండల అధ్యక్షుడు అశోక్ గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనులు నచ్చి ఆ పార్టీలో చేరానన్నారు. అలాగే తిమ్మాపూర్, అనంతసాగర్, జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో హామీల అమలు

గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని 7, 8 వార్డుల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగ్యారంటీలను అమలు చేస్తూనే ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ



కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో తగిన వసతులు కల్పించాలని అడిషనల్ అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన మండలంలోని రేబర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. చేసిన పనులకు సకాలంలో డబ్బులు ఇస్తున్నారా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో కూలీలకు తాగునీరు, నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం 6 నుంచి 10.30 గంటల లోపు పనులు చేసి వెళ్లాలన్నారు. పనిచేసే వారి పేర్లు తక్షణమే మస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఈసీ పర్శరాములు, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ తదితరులున్నారు.

విధులను శ్రద్ధతో నిర్వహించండి

- స్వామి రాఘువేంద్ర ప్రభు సూచన
- ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం



మాట్లాడుతున్న స్వామి రాఘవేంద్ర ప్రభు

పటాన్‌చెరు: ''నీ విద్యుక్త ధర్మాన్ని నిర్వహించడానికి నీకు అధికారం ఉంది. కాని నీ కర్మఫలాలకు నీవే కారణం అని ఎన్నడూ భావించకు'' అని భగవద్గీతను ఉటంకిస్తూ హరేకృష్ణకు చెందిన స్వామి రాఘవేంద్ర ప్రభు ఉద్బోధించారు. గీతం విశ్వవిద్యాలయం ఉత్తమ సహాయక, అనుబంధ ఉద్యోగుల సేవలను గుర్తించి వారికి అవార్డులిచ్చి ప్రోత్సహించేందుకు గాను డైరెక్టరేట్ ఆఫ్ హాస్పిటాలిటీ గురువారం 'ముదిత' పేరిట వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామి రాఘవేంద్ర మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను శ్రద్ధతో, ఆసక్తితో నిర్వహించాలని, ఫలితం భగవంతుడికి వదిలేయాలని సూచించారు. వివిధ విభాగాలలో అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి, వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో గీతం అదనపు ఉపకులపతి డీఎస్.రావు, క్యాంపస్ లెఫ్ట్ డీన్ డాక్టర్ బాల కుమార్ గురునాథ్, హాస్పిటలిటీ డైరెక్టర్ హేమంత్, డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

వర్గల్(గజ్వేల్): ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాలు చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తోందని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. గురువారం వర్గల్ మండలం మైలారం, చౌదరిపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల కనీస వేతనం రూ.300కు పెంచినప్పటికీ, క్షేత్రస్థాయిలో రూ.150 దాటడం లేదన్నారు. ఇంటర్నెట్ సరిగా లేని ప్రాంతాల్లో ఆన్‌లైన్ హాజరు ఇబ్బందికరంగా మారిందన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

జిల్లా అధికార ప్రతినిధి భూమేష్ గౌడ్



రామునిపట్లలో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమేష్ గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతసాగర్, రామునిపట్లలో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ పాలనలోనే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు.

తప్పుడు ప్రచారం

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా గురువారం పార్టీ నాయకులు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

అభివృద్ధి దిశగా పయనించాలంటే ..

మర్కూక్(గజ్వేల్): గ్రామాలు అభివృద్ధి దిశగా పయనించాలంటే బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన మర్కూక్‌లో రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి రఘునందన్‌రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రమేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి మార్కెట్‌యార్డులో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



రోదిస్తున్న రైతు అనిల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన రైతు బద్దిపడిగె అనిల్‌రెడ్డి పాడిగేదె విద్యుదాఘాతంతో గురువారం ఉదయం మృతి చెందింది. రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు విద్యుత్ వైర్లు తెగి పొలంలో పడ్డాయి. వైర్లు తెగిపడిన విషయం గమనించకపోవడంతో పాడిగేదెను మేత కోసం పొలంలోకి వదిలాడు. విద్యుత్ వైర్లను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడిగేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: నిబంధనలు పాటిస్తూ ప్రైవేటు ఆసుపత్రులు వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం గజ్వేల్‌లో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, డైరెక్టర్లు, వైద్యులకు పీసీపీఎన్‌డీటీ యాక్ట్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, సరోగసీ యాక్ట్, ఎంటీపీ యాక్ట్, నోట్ ఫోర్ డిసీజెస్, ఆయుష్మాన్ భారత్‌పై ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్య చట్టాలను అనుసరించి ఆసుపత్రులకు వచ్చే వారికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చేసుకునేవారు డీఆర్‌ఏ ద్వారా జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో వివిధ పరీక్షలకు సంబంధించిన ధరల సూచిక పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘిస్తే, చట్ట వ్యతిరేకంగా అబార్షన్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిని, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ లింగం, వైద్యులు మహిపాల్, సుజాత, నరేష్‌బాబు, మల్లయ్య, వాసవాచారి, సద్గుణచారి, పద్మజ్యోతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రభాకర్, వైద్యులు శ్రీనివాస్, శ్రీదేవి, విజయరాణి, రజనీ, రవీందర్‌రెడ్డి, డేనియల్, సోఫాన్ రాథోడ్, సాయిబాబా, నవీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా తనిఖీ

సిద్దిపేటకమాన్: ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట కాళ్లకుంట కాలనీ బస్తీ దవాఖానాను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ స్టోర్‌లో మందులు, పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దవాఖానాల్లో ఓపీ సంఖ్యను పెంచాలన్నారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌లో మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి చికిత్స అందించాలన్నారు.

ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం



ధర్మాజీపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్

దుబ్బాకటౌన్: అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ మండిపడ్డారు. పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 7,8,9 వార్డులలో కౌన్సిలర్లు బత్తుల స్వామి, దుబ్బాక బాలకృష్ణ గౌడ్, కనకయ్యతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మెదక్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ పెంటమ్మ, నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేలా ..

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేలా పోరాటం చేయాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, మల్లయ్య అన్నారు. పార్టీ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గురువారం ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు.

గెలుపే లక్ష్యంగా..

మర్కూక్(గజ్వేల్): భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, బీఆర్‌ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య అన్నారు. గురువారం వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మండలంలోని నర్సన్నపేట, పాములపర్తి, యూసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి ఎంపీపీ పాండుగౌడ్, మ్యాకల కనకయ్య కొద్దిసేపు మట్టి మోసే పనులు చేశారు.

కల్లబొల్లి మాటలకు మోసపోవద్దు

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలు నమ్మి మరోమారు మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ర్యాగల్ల సుగుణ అన్నారు. మండంలోని దుద్దెడ, తిమ్మారెడ్డిపల్లి, సిర్సనగండ్ల, వెలికట్ట, మర్పడ్గ, బందారం, దర్గా గ్రామాల్లో బీఆర్‌ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికి తిరుగుతూ..

సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎండను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. గురువారం నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఉపాధి హామీ కూలీలను అభ్యర్థించారు. ప్రచారంలో నాయకులు పాల్గొన్నారు.

ఆ పార్టీలకు గుణపాఠం తప్పదు

మద్దూరు(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తప్పదని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన భువనగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేసి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నీలం మధు గెలుపు ఖాయం

మర్కూక్(గజ్వేల్): ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని మాజీ సర్పంచ్ మోండి భాగ్య భిక్షపతి కోరారు. గురువారం మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో ఇంటింటి కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. నీలం మధును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

కొండపాక(గజ్వేల్): పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ కోరారు. మండలంలోని కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, మర్పడ్గ, దుద్దెడ, జప్తినాచారం, వెలికట్ట గ్రామాల్లో ఈజీఎస్ పనులు చేసే చోట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలిచినా ప్రయోజనం ఉండదనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తూ..

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం కొండంరాజ్‌పల్లి, ఖానాపూర్, నంగునూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అధికారంలోకి వచ్చేది..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే అని టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన అక్కన్నపేట మండలం చాపగానితండా గ్రామ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని వంకాయతండాకు చెందిన గుగులోతు రాజు బైక్‌పై చాపగానితండాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తండా సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రాజు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజుకు భార్య, కుమార్తె ఉన్నారు. క్షతగాత్రుడిని ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



చేర్యాల(సిద్దిపేట): ఈనెల 13వ తేదీన జరగనున్న ఎంపీ ఎన్నికల దృష్ట్యా పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను గురువారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ నర్సయ్య సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకి అవసరమైన వసతులు కల్పించాలని, ఎవరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

రక్తదానంచేసి ప్రాణదాతలు కావాలి

డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ శివకుమార్



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న శివకుమార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: రక్తదానంచేసి ప్రాణదాతలు కావాలని డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ పిలుపునిచ్చారు. దత్తగిరి కాలనీ బసవ మండపంలో రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతోపాటు ప్రమాదకర పరిస్థితుల్లో మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారన్నారు. బసవ జయంతి సందర్భంగా రాష్ట్రీయ బసవదళ్ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 65 మంది రక్తదానం చేయగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప, నారాయణఖేడ్ అధ్యక్షుడు నగేశ్ బిరదార్, నాయకులు అన్వర్, యశ్వంత్‌రావు, అప్పరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే పట్టం కట్టాలి



కట్కూర్‌లో ఉపాధి హామీకూలీలతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మరోసారి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా బండి సంజయ్, దేశం కోసం నరేంద్ర మోదీలకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో బండి సంజయ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం బీజేపీకి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామచం మహేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, కట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల్ల అశోక్‌రెడ్డి, నాయ కులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయుల పదోన్నతికి నిర్వహించిన టెట్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో టెట్‌పై ఏర్పడిన అనిశ్చితిని తొలగించేందుకు ఎన్సీటీఈ నుంచి వివరణ తీసుకోవాలని గతంలో లేఖ రాశామన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ వెళ్లిన యూఎస్పీసీ, జాక్టో ప్రతినిధులు ఎన్సీటీఈ సెక్రటరీ షేర్పాతో సమావేశమైనప్పుడు ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలల స్థాయిలో మార్పులేనప్పుడు పదోన్నతులకు టెట్ అవసరం లేదని వివరణ ఇస్తూ తెలంగాణ విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ పంపారనే విషయాన్ని గుర్తు చేశారు. టెట్ గడువుకంటే ముందే కమిషనర్‌కు వివరణ లేఖ వచ్చినప్పటికీ ఆ విషయం వెల్లడించకుండా ఉపాధ్యాయులను మానసికాందోళనకు గురిచేసిన కమిషనర్ చర్యను ఖండిస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని, ఈనెల 13న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ని గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం మల్లేష్‌కు మద్దతుగా పట్టణ కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ గెలిస్తే బీజేపీతో కలుస్తుందని కాంగ్రెస్ ప్రచారం చేసి గెలవాలని చూస్తోందన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.